సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 1 । జనవరి । 2024



కలగానే మత్స్య పాలిటెక్నిక్

ఉమ్మడి జిల్లాలోని పాలేరుకు మంజూరైన మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభంపై నీలినీడలు కమ్ముకున్నాయి. 12లో



తెగ తాగేశారు..

ఉమ్మడి జిల్లాలో గడిచిన ఏడాదిలో మద్యం విక్రయాలు అధికంగా జరగ్గా, ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చింది. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 18°

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ నుంచి ఉదయం వరకు మంచు అధికంగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

అంజన్న సన్నిధిలో రాపత్తు సేవ



రాపత్తు సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: శ్రీ సీతారామచంద్రస్వామి వారికి దాసుడైన అంజన్న సన్నిధిలో ఆదివారం రామయ్యకు వైభవంగా రాపత్తు సేవ నిర్వహించారు. మేళతాళాలు, భాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారిని అభయాంజనేయ స్వామి ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రసాద నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి ఆదివారం అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారికి విశేషపూజలు జరపగా, భక్తులు క్యూలైన్ ద్వారా దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

మంత్రులు, కలెక్టర్ 'నూతన' శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతీ ఒక్కరి జీవితంలో నూతన సంవత్సరం సరికొత్తగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని, సరికొత్త గమ్యాలతో మరిన్ని విజయాలు సాధించాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదివారం జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం నూతన ఉత్సాహంతో అభివృద్ధి, సంక్షేమంలో మరింత ముందుకు సాగుతూ అప్రతిహతమైన అభివృద్ధిని సాధించే సంవత్సరం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఐటీడీఏ పీఓ శుభాకాంక్షలు

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. 2024లో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవురోజు కావడంతో అధికారులు అందుబాటులో ఉండరని, ఈ కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

గిరిజన దర్బార్ కూడా..

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నేడు నిర్వహించే గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వం సెలవు దినం కావడంతో ఐటీడీఏ కార్యాలయంలోని యూనిట్ అధికారులు అందుబాటులో ఉండని కారణంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

మద్యపానం విక్రయించొద్దని పంచాయతీ తీర్మానం

పాల్వంచరూరల్: మండలంలోని దంతలబోరు ఎస్సీకాలనీ గ్రామపంచాయతీ పరిధిలో మద్యపానం విక్రయించొద్దని తీర్మానం చేశారు. ఆదివారం నిర్వహించిన గ్రామపంచాయతీ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గద్దల రమేష్ మాట్లాడుతూ మద్యపానం తాగడం వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని అన్నారు. ఎవరూ నష్టపోకుండా ఉండేందుకు పంచాయతీలో మద్యపాన విక్రయాలను నిషేధించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ వెంకటనర్సమ్మ, ఆదిలక్ష్మి, శ్రీలత, కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

కొత్త ఆశలతో..



కొత్త సంవత్సరానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా స్వాగతం పలికింది. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం.. పది అసెంబ్లీ స్థానాల్లో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు.. ఉమ్మడి జిల్లాకు మంత్రి వర్గంలో పెద్ద పీట.. సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ.. ఇలా ఒక్కో కార్యక్రమంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సందడి నెలకొంది. ప్రజాప్రతినిధులు ఈ ఏడాది కొత్తగా లక్ష్యాలను పెట్టకొని ముందుకెళ్తుండగా.. ప్రభుత్వ 'గ్యారంటీ' హామీతో తమకు ఈ ఏడాది సంక్షేమ ఫలాలు అందుతాయని నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం కసరత్తు నేపథ్యంలో నిరుద్యోగుల్లో ఆశలు చిగురుస్తున్నాయి. ఈ ఏడాది తమ నిరీక్షణకు ఫలితం దక్కుతుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. –సాక్షిప్రతినిధి, ఖమ్మం

నూతన ప్రభుత్వం.. నూతన ఎమ్మెల్యేలు

- సంక్షేమ పథకాలపై పేదల ఆశలు
- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించిన సర్కారు
- ఉద్యోగ నోటిఫికేషన్లకు నిరుద్యోగుల ఎదురుచూపులు
- సరికొత్త లక్ష్యాలతో నూతన సంవత్సరంలోకి అడుగులు

సంక్షేమం.. అభివృద్ధి..

ఉమ్మడి జిల్లా నుంచి కొత్త ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా మల్లు భట్టివిక్రమార్క, మంత్రులుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కొలువుదీరారు. వారికి కేటాయించిన శాఖల పరంగా రాష్ట్రంలోనే కాకుండా ఉమ్మడి జిల్లాపై ముగ్గురు మంత్రులు దృష్టి పెట్టారు. ఉమ్మడి జిల్లాలోని పలు పెండింగ్ సమస్యలు, చేయాల్సిన అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. అంతేకాక ఆయా శాఖల పరంగా పర్యవేక్షణ కూడా చేశారు. పాలేరు నియోజకవర్గంపై మంత్రి పొంగులేటి జిల్లా, నియోజకవర్గ అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలో ఏ పనులు ఎంత మేరకు జరిగాయి, ప్రధాన సమస్యలు ఏమిటో తెలుసుకున్నారు. అలాగే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మణుగూరులో నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించి పనితీరుపై అధికారులతో చర్చించారు. మంత్రి తుమ్మల కూడా ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా సాగవుతున్న పామాయిల్ పంటకు మార్కెటింగ్‌లో రైతుల ఇబ్బందులు, కొత్త పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణంపై దృష్టి పెట్టి సమీక్ష చేశారు. ఉమ్మడి జిల్లాపై పూర్తి అవగాహనతో ఉన్న ముగ్గురు మంత్రులు.. ఈ ఏడాది ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు అభివృద్ధిని తొలి ప్రాధాన్యతగా తీసుకొని ముందుకెళ్తున్నారు.

ఉద్యోగాల కల్పనకు..

క్షేత్ర స్థాయిలో అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. ఏ శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో వాటి ప్రకారం నోటిఫికేషన్లు వెలువరించే అవకాశం ఉంది. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీతో భర్తీ చేస్తామని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆయా అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలో ఉన్న ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేస్తే తమకు ఉద్యోగం వస్తుందన్న ఆశలో డీఎడ్, బీఎడ్ పూర్తి చేసి టెట్ అర్హత సాధించిన నిరుద్యోగులున్నారు. గ్రూప్ – 1, 2, 3, 4తో పాటు ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేపడతామని ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగులు ఈ ఏడాది తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎలాంటి విఘ్నాలు లేకుండా తమ ఆకాంక్షలు నెరవేరాలని ఎవరికి వారు కోరుకుంటున్నారు.

సంక్షేమంలో రాజీ పడం



ఉమ్మడి జిల్లాలోని గిరిజనులకు, గిరిజన విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాల విషయంలో ఎక్కడా రాజీ పడం. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఈ మేరకు దిశా నిర్దేశం చేస్తాం. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ప్రజలంతా ఈ నూతన సంవత్సరంలో సుఖ, సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా. ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– ప్రతీక్‌జైన్, ఐటీడీఏ పీఓ, భద్రాచలం

పేదల్లో ఆనందం..

సంక్షేమ పథకాల లబ్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న అభయహస్తం దరఖాస్తులతో నిరుపేదల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసింది. మిగిలిన ఐదు గ్యారంటీలకు దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈనెల 6తో ఈ ప్రక్రియ ముగియనుంది. గతనెల చివరి నాటికి ఖమ్మం జిల్లాలో 58,330, భద్రాద్రి జిల్లాలో 1,03,356 దరఖాస్తులు వచ్చాయి. గ్రామ సభలకు ప్రజలు భారీగా పోటెత్తుతుండడంతో అంతటా కోలాహలం సంతరించుకుంది. ఈ దరఖాస్తుల ద్వారా ఎంత మంది అర్హులు ఉన్నారనేది సిబ్బంది క్షేత్ర స్థాయి పరిశీలనలో తేలనుంది. అంతటా కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు వస్తుండడంతో లబ్ధిదారుల ఎంపిక కొంత ఆలస్యం కానుందనే ప్రచారం జరుగుతోంది. రైతుబంధు, గతంలో పింఛన్లు అందుకునే వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవద్దని ప్రభుత్వం ప్రకటించింది.

కేసులు సత్వర పరిష్కారం



కొత్తగూడెంటౌన్: జిల్లాలోని 13 కోర్టుల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించేలా న్యాయ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. కొత్త సంవత్సరంలో చట్టాలపై పరిజ్ఞానం పెంపొందించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. జిల్లాకు మరిన్ని కోర్టులు వచ్చేలా ప్రయత్నిస్తున్నాం. నిరుపేదలకు ఉచితంగా న్యాయసహాయం అందేలా చూస్తాం. యువత భవిష్యత్‌ను అంధకారం చేసుకోకుండా మంచి మార్గంలో నడవాలి. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

–పాటిల్ వసంత్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు



సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడమే లక్ష్యం. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధిలో, సంక్షేమంలో జిల్లాను రోల్‌మోడల్‌గా నిలిపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తాం. గిరిజనులకు విద్య, వైద్యం అందేలా నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలే మా ప్రాధాన్యతాంశాలు. రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా, ఆదివాసీ జిల్లాగా ఉన్న భద్రాద్రి కొత్తగూడేనికి కలెక్టర్‌గా రావడం సంతోషం.

– డాక్టర్ ప్రియాంక ఆల, కలెక్టర్

ఆర్థికాభివృద్ధికి కృషి



సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో అధికంగా ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఆర్థికాభివృద్ధి చెందేలా భూ సమస్యలను పరిష్కరించడమే నూతన సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్నాం. వారి భూములకు హక్కు కల్పించేలా సరిగ్గా ఆన్‌లైన్ కాలేదు. ప్రజావాణి కార్యక్రమంలో ఇలాంటి దరఖాస్తులే ఎక్కువగా వస్తున్నాయి. వారికి భూమిపై హక్కులు కల్పించేందుకు కృషి చేస్తాం. నూతన సంవత్సరంలో సొంత జిల్లాలో విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

–పి.రాంబాబు, అదనపు కలెక్టర్

'సింగరేణి'తో సామాజిక వెలుగులు

- 135 ఏళ్లుగా బొగ్గు వెలికి తీస్తున్న సంస్థ
- ఆరంభంలో బొగ్గు బావిలో పనంటే నరకమే
- ప్రాణాలకు తెగించి విధుల్లో చేరిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు
- క్రమేణా మెరుగుపడిన బలహీనవర్గాల జీవితాలు



సింగరేణి ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలో రామయ్యను దర్శించుకునేందుకు వెళ్లే భక్తులు దారి మధ్యలో వంట పొయ్యి కోసం ఉపయోగించిన రాళ్ల మండటం ద్వారా దక్షిణ భారత దేశంలో బొగ్గు ఆనవాళ్లను తొలిసారిగా గుర్తించారు. ఆ తర్వాత తవ్వకాలు చేపట్టగా తెలంగాణలో పారిశ్రామిక రంగం పుంజుకున్నది. వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో వెలుగులు నిండాయి. ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ స్టేట్ విలీనం కాక ముందు 1871లో ఇల్లెందులో బ్రిటిషర్లు బొగ్గు తవ్వకాలు ప్రారంభించారు. ఆ తర్వాత గనులు కొత్తగూడెం, తాండూరు (బెల్లంపల్లి)కు విస్తరించాయి. అరకొర సాంకేతిక పరిజ్ఞానం, జాడ లేని రక్షణ ఏర్పాట్ల మధ్య జరిగే బొగ్గు తవ్వకాలతో గనుల్లో నిత్యం ప్రమాదాలు జరిగేవి. ఆ రోజుల్లో బొగ్గు బావుల్లో పనికి వెళ్లి, తిరిగి ప్రాణాలతో బయటకు వస్తే అదృష్టమేనని చెప్పుకునేవారు. దీంతో బొగ్గు బావుల్లో పని చేసే కార్మికులను సమీకరించడం కష్టంగా ఉండేది. చివరకు ఉత్తరప్రదేశ్, బిహార్, బర్మా నుంచి కూడా కార్మికులను తీసుకొచ్చేవారు. అయినా కొరత తీరక బొగ్గు గనులకు సంబంధించిన కాంట్రాక్టర్ల తరఫున ఏజెంట్లు పల్లెలను జల్లెడ పట్టేవారు. ఆ రోజుల్లో గ్రామాల్లో భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల ఉక్కుపాదాల కింద నలిగిపోతున్న గ్రామీణ ప్రాంత ప్రజలకు బొగ్గు గనుల్లో బంగారు భవిష్యత్ ఉంటుందని కాంట్రాక్టర్లు నమ్మబలికేవారు. అలా భూమి, ఏ ఇతర ఆర్థిక ఆలంబన లేని ఎస్సీ, బీసీలతో పాటు ప్రత్యేక జీవన విధానం కలిగిన గిరిజన గూడేలు, తండాలకు వెళ్లి అక్కడి వారిని గనుల్లో పనులకు తీసుకొచ్చేవారు.

కాంట్రాక్టర్ల దోపిడీ..

గనుల్లో అత్యంత దుర్భర పరిస్థితుల మధ్య కనీస రక్షణ ఏర్పాట్లు లేకుండా పిల్లాపాపలు, మహిళలతో సహా బొగ్గు గనుల్లో రేయింబవళ్లు కార్మికులు పని చేసేవారు. మహిళలపై అకృత్యాలు నిత్యకృత్యంగా ఉండేవి. ఇక్కడి పరిస్థితులకు తాళలేక పారిపోయేందుకు ప్రయత్నించే వారిని వెదికి పట్టుకుని చిత్రహింసలు పెట్టేవారు. ఇందుకోసం కాంట్రాక్టర్లకు ప్రత్యేక రౌడీల వ్యవస్థ ఉండేది. అప్పటికే నిజాం రాజ్యంలో రైల్వే యూనియన్ (హైదరాబాద్), అజాంజాహి మిల్ వర్కర్స్ (వరంగల్) పేరిట కార్మిక సంఘాలు ఉండేవి. ఆ తర్వాత మూడో యూనియన్‌గా 1938లోనే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) మొదలైంది. ఆ తర్వాత మరిన్ని సంఘాలు వచ్చి కార్మికులకు అనేక హక్కులను సాధించి పెట్టాయి.

80 శాతానికి పైగా..

స్వాతంత్య్రం వచ్చిన తర్వాత పారిశ్రామికీకరణలో వేగం పెరిగింది. అందుకు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తి పెంచాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి కరీంనగర్, వరంగల్ జిల్లాలకు సింగరేణి విస్తరించింది. బొగ్గు వెలికితీతకు మరింత మంది కార్మికులు అవసరమయ్యారు. ఫలితంగా ఎలాంటి విద్యార్హత, రాత పరీక్ష లేకుండా దేహదారుఢ్య (రన్నింగ్, గుంజీలు) పరీక్షల ద్వారా భద్రత కలిగిన ప్రభుత్వ ఉద్యోగం అందించే సంస్థగా సింగరేణి నిలిచింది. దీంతో అప్పటివరకు ఉపాధి కోసం బొంబాయి, దుబాయి వెళ్లేందుకు అలవాటు పడిన ఉత్తర తెలంగాణలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వారు బొగ్గుబావుల వైపు మొగ్గు చూపారు. 1992లో ఆర్థిక సంస్కరణలు మొదలైనప్పుడు సింగరేణి వ్యాప్తంగా 1.16 లక్షల మంది కార్మికులు ఉంటే అందులో 80 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలే కావడం గమనార్హం.

యాంత్రీకరణ పెరిగినా..

ఉత్తర తెలంగాణలో గోదావరి తీరం వెంట ఎలాంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు లేకపోయినా సింగరేణితో వచ్చిన పారిశ్రామికీకరణ వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీల జీవితాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఆర్థిక స్వావలంబన దొరికింది. దీంతో నాణ్యమైన విద్య, వైద్యం దగ్గరయ్యాయి. ఆరంభంలో మితిమీరిన మద్యపానం వంటి వ్యసనాల కారణంగా కార్మికుల కుటుంబాలు ఇబ్బంది పడినా కాలక్రమేణా ఈ జాడ్యం అదుపులోకి వచ్చింది. దీంతో ఊరికి దూరంగా వెలివేయబడ్డ ఎస్సీల కుటుంబాలు, ఆర్థిక స్వావలంబన లేని బీసీల ఇళ్లు, నాగరిక ప్రపంచానికి ఆమడ దూరంలో ఉండే గిరిజన తెగల్లో స్పష్టమైన మార్పులు వచ్చాయి. ఆ వర్గాలకు చెందిన కుటుంబాల నుంచి కేవలం రెండో, మూడో తరం నుంచే వేల మంది డాక్టర్లు, ఇంజనీర్లు, సివిల్ సర్వెంట్లు వచ్చారు. ఇంకా వస్తూనే ఉన్నారు.

ప్రస్తుతం సింగరేణిలో ఏరియాల వారీగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వివరాలు (మొత్తం 32 శాతం)

ఏరియా	కార్మికులు	ఎస్సీ	శాతం	ఎస్టీ	శాతం
బెల్లంపల్లి	981	285	29.05	88	8.97
మందమర్రి	4,851	1,416	29.19	315	6.49
శ్రీరాంపూర్	9,094	2,167	23.83	572	6.28
కొత్తగూడెం	2,364	682	38.32	224	9.47
ఇల్లెందు	599	116	19.36	129	21.54
మణుగూరు	2,417	622	25.73	328	13.57
ఆర్జీ–1	5,458	1,369	25.08	251	4.60
ఆర్జీ –2	3,529	684	18.67	154	4.39
ఆర్జీ –3	3,931	734	18.67	238	6.06
భూపాలపల్లి	5,334	1,234	23.13	715	13.54
కార్పొరేట్	1,198	318	26.54	436	9.85
ఎస్టీపీపీ	63	15	23.81	2	3.19
మొత్తం	39,819	9,642	24.21	3,134	7.87

'నయా' జోష్



కొత్తగూడెం రామవరంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న స్థానికులు

- అర్ధరాత్రి నుంచే ఘనంగా నూతన సంవత్సర సంబరాలు
- కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచుకున్న బంధుమిత్రులు

కొత్తగూడెంటౌన్: జిల్లావ్యాప్తంగా నూతన సంవత్సర సందడి నెలకొంది. ఆదివారం అర్ధరాత్రి నుంచే యువతీ యువకులు కేక్‌లు కట్ చేస్తూ వేడుకలు జరుపుకున్నారు. వీధుల్లోకి వచ్చి కేరింతలు కొట్టారు. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2024 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఇళ్ల ముందు ముగ్గులు వేసుకున్నారు. పలుచోట్ల నృత్యాలతో సందడి చేశారు.

ఆఫర్లతో కేక్‌లు, బిర్యానీ అమ్మకాలు

డిసెంబర్ 31 రోజు సందర్భంగా వ్యాపారులు పలు ఆఫర్లు ప్రకటించారు. ఒక బిర్యానీ కొంటే మరో బిర్యానీ, కూల్‌డ్రింక్ ఉచితంగా అందజేశారు. బిర్యానీ సాధారణ రోజుల్లో రూ. 180 ఉంటే ఆదివారం రూ.150కు విక్రయించారు. కేక్ కేజీ మాములు రోజుల్లో రూ.180 ఉండగా పండగకు రూ.120కు అమ్మకాలు జరిపారు. దీంతో కొనుగోలుదారులతో రెస్టారెంట్లు, హోటళ్లు, బిర్యానీ పాయింట్లు సందడిగా మారాయి. కొత్తగూడెంలోని సూపర్‌బజార్ మార్కెట్, చిన్నబజార్, రామవరం, రుద్రంపూర్, పాలకేంద్రం, విద్యానగర్‌కాలనీ, పాత కొత్తగూడెం, గణేష్‌టెంపు తదితర ప్రాంతాలతోపాటు పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట వంటి పట్టణాల్లోని దుకాణాలు కిటకిటలాడాయి. పూలు, స్వీట్లు, కేక్‌ల అమ్మకాలు జోరుగా సాగాయి. అపార్ట్‌మెంట్లు, వీధుల్లో ఉమ్మడిగా పలు కుటుంబాలు కలిసి వేడుకలు జరుపుకున్నారు.

మెగా చాంపియన్‌గా ఖమ్మం జోన్

- అథ్లెటిక్స్‌లో మెరిసిన భద్రాచలం క్రీడాకారిణులు
- ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన గురుకులాల క్రీడాపోటీలు



ట్రోఫీ అందుకుంటున్న ఖమ్మం జోన్ క్రీడాకారిణులు



హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీలు

ఇల్లెందురూరల్: నాలుగు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి గిరిజన గురుకులాల 7వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. మండలంలోని సుభాష్‌నగర్ గిరిజన గురుకులంలో పోటీలు నిర్వహించగా, రాష్ట్ర వ్యాప్తంగా 1,200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో 28 ఈవెంట్లలో పోటీలు జరిగాయి. వివిధ పోటీల్లో విద్యార్థినులు సత్తా చాటారు. ఖమ్మం జోన్ టోర్నీ మెగా చాంపియన్‌గా నిలిచింది. భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి క్రీడాకారిణులు అథ్లెటిక్స్‌లో ప్రతిభచూపారు.

గురుకులం పిల్లలు శక్తిమంతులు : ఎమ్మెల్యే కోరం

గురుకులం పిల్లలు అత్యంత శక్తిమంతులని, ఏదైనా సాధించగల సత్తా వారిలో ఉందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. ముగింపు వేడుకలకు హాజరైన ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఎందులోనూ తక్కువ కాదని, అవకాశం కల్పిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంకేతిక పరిణతి లక్ష్యంగా గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థినులు క్రీడా రంగంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మాధవి, సుభాష్‌నగర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, వైస్‌ప్రిన్సిపల్ షాజహాన్, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలలు, పాఠశాలల ప్రధానాచార్యులు, క్రీడా శిక్షకులు, ఎంపీటీసీ మండల రాము, ఉపసర్పంచ్ నాలవెల్లి నర్సింహారావు, వార్డు సభ్యులు గుమ్మడి అపర్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, పులి సైదులు, పెసా కార్యదర్శి వజ్జ నిర్మల, దొడ్డ డానియల్, జాఫర్, కిరణ్, రాంచందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజు పోటీల విజేతలు వీరే..

అండర్–19 వాలీబాల్ ఫైనల్‌లో జోన్–3జట్టుతో సెలక్షన్ టీం తలపడగా జోన్–3 జట్టు విజేతగా నిలిచింది. కబడ్డీలో జోన్–3 విజేతగా నిలవగా సెలక్షన్ టీం రన్నరప్‌గా నిలిచింది. అండర్–17 వాలీబాల్‌లో జోన్–2 జట్టుపై జోన్–3 టీం ఘన విజయం సాధించింది.

అథ్లెటిక్స్‌లో వ్యక్తిగత చాంపియన్లు

అండర్–14 విభాగంలో అన్నపురెడ్డిపల్లి గురుకులం క్రీడాకారిణి జె.సాత్విక, అండర్–17 విభాగంలో భద్రాచలం గురుకులం క్రీడాకారిణి పి.ఇందు, అండర్–19 విభాగంలో భద్రాచలం గురుకులం క్రీడాకారిణి టి.శ్రీతేజ అథ్లెటిక్స్ వ్యక్తిగత చాంపియన్లుగా నిలిచారు.

అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్

అండర్–19 విభాగంలో జోన్–3 (ఖమ్మం), అండర్–17 విభాగంలో జోన్–1 (ఆదిలాబాద్), అండర్–14 విభాగంలో జోన్–3 (ఖమ్మం) చాంపియన్లుగా నిలిచాయి.

గేమ్స్ ఓవరాల్ చాంపియన్

అండర్–19 విభాగంలో జోన్–3 (ఖమ్మం), అండర్–17 విభాగంలో జోన్–4 (మహబూబ్‌నగర్), అండర్–14 విభాగంలో జోన్–4 (మహబూబ్‌నగర్) చాంపియన్లుగా నిలిచాయి.

మెగా చాంపియన్‌గా ఖమ్మం..

అండర్–19, అండర్–17, అండర్–14 విభాగంలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో రీజియన్ చాంపియన్‌తోపాటు టోర్నీలో మెగా చాంపియన్‌గా ఖమ్మం జోన్ నిలిచింది.

విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు దిక్సూచి... మన విద్యాలయాలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు - 2024



ఆధునిక విద్యకు దిక్సూచి సర్వజ్ఞ

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విలువలతో కూడిన విద్యను అందిస్తూ చిన్నారులను సర్వజ్ఞులుగా తీర్చిదిద్దుతున్న విద్యా ప్రాంగణం సర్వజ్ఞ స్కూల్. ఖమ్మం రెజొనెన్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ గార్ల పర్యవేక్షణలో ప్రారంభించబడి, అనతి కాలంలోనే ఖమ్మంలో నెంబర్-1 విద్యాసంస్థగా నిలవటం గర్వకారణం. ప్రతి తరగతి గదిలో పరిమితి సంఖ్యలో విద్యార్థులతో, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహిస్తూ చిన్నారులను ఆల్‌రౌండర్స్‌గా తీర్చిదిద్దే విద్యా సంస్థ సర్వజ్ఞ. ప్రీ ప్రైమరీ విభాగంలో మాంటిస్సొరి విధానాలతో ప్లే వే మేథస్సుతో నూతన విద్యా విధానానికి అనుగుణంగా బోధనలు చేస్తూ చిన్నారుల సృజనాత్మకత శక్తులను వెలికి తీయటానికి సర్వజ్ఞ స్కూల్ ముందుంది అనటంలో ఏలాంటి సందేహం లేదు. ప్రైమరీ విభాగంలో చదువుతో పాటు ఆటపాటలకు తగు ప్రాముఖ్యతనిచ్చి విద్యార్థుల్లో నిగూఢంగా దాగి ఉన్న వారి శక్తి సామర్థ్యాలను వెలికి తీసి విద్యార్థులను అత్యుత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటంలో సర్వజ్ఞ పాత్ర చెప్పుకోదగినది. 6వ తరగతి నుంచి ఐఐటీ, మెడికల్ మరియు సివిల్స్ ఫౌండేషన్‌తో పాటు లైఫ్ స్కిల్స్‌కు కూడా తగు ప్రాధాన్యతను నేర్పుతుంది సర్వజ్ఞ.

విజ్ఞానాన్ని పెంచే విద్య నిర్మల్ హృదయ్ ప్రత్యేకత

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేలా విద్యాబోధన చేయడం నిర్మల్ హృదయ్ హైస్కూల్ ప్రత్యేకత అని ఫౌండర్ చైర్మన్ వంగా సాంబశివరెడ్డి, ప్రిన్సిపల్ వంగా పద్మ తెలిపారు. విద్యార్థులకు మంచి విద్యను అందించడంతోపాటు వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించేలా కృషి చేస్తామని తెలిపారు. యువతలో సృజనాత్మక, యాక్టివ్ ఆలోచనా ప్రైమరీ, ప్రీ ప్రైమరీ తరగతులకు ప్రత్యేక క్యాంపస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఉల్లాసంగా ఆడుకునేం దుకు వీలుగా ప్లేగ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్, రవాణ సౌకర్యం ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థుల ఉన్నతికి లిటిల్ ఫ్లవర్ పట్టుకొమ్మ

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు లిటిల్ ఫ్లవర్ స్కూల్, కళాశాలలు పట్టుకొమ్మల్లా ఉపయోగపడుతున్నాయని విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, రమేష్‌బాబు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గత 30 సంవత్సరాలుగా విద్యారంగంలో విశేషమైన విద్యను అందిస్తున్నాయని తెలిపారు. ఫౌండర్ మాగంటి సూర్యం అందించిన స్ఫూర్తితో విద్యా సంస్థలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ర్యాంకులు సాధించి స్కూల్, కళాశాల్లో అత్యుత్తమ ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని తెలిపారు.

లక్ష్యం ఏదైనా నారాయణ విద్యా సంస్థతోనే సాధ్యం

గత 45 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన నారాయణ విద్యాసంస్థ ఇప్పుడు మన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విజయకేతనం ఎగురవేయడానికి సంగర్వంగా నాలుగు బ్రాంచీలతో మీ ముందుకు వచ్చింది. మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తును, తల్లిదండ్రుల బంగారు కలలను నెరవేర్చటంలో తిరుగులేని అగ్రగామి విద్యాసంస్థ మన నారాయణ. ప్రతి విద్యార్థికి ఐఐటి మరియు మెడిసిన్‌లో ఉత్తీర్ణత సాధించటానికి అనుభవజ్ఞులైన టీచర్లతో విద్యా బోధన చేయటం నారాయణ ప్రత్యేకత.. అలాగే పిల్లలలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయటానికి డిజిటల్ విద్యా విధానం మరియు ప్లేవే మెథడ్స్, యాక్టివిటీస్ ద్వారా విద్యాబోధన మా ప్రత్యేకత. వచ్చే 2024-25 అడ్మిషన్లకై మీ సమీపంలోని బ్రాంచీలలో తీసుకోవలసిందిగా ఖమ్మం జిల్లా ఎజిఎం వేణుగోపాల్ రావు తెలిపారు.



ప్రైవేట్ పాఠశాలల ఖమ్మం డివిజన్ కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: బల్లేపల్లిలోని బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో శనివారం ఖమ్మం డివిజన్ ఎన్నికలు జరిగినట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కేసా వీరన్న, అజారుద్దీన్, జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, ట్రెజరర్ నాసరయ్యలు తెలిపారు. ఖమ్మం డివిజన్ అధ్యక్షుడిగా ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ జాఫర్ మతిన్, ప్రధాన కార్యదర్శిగా విన్‌ఫీల్డ్ కరస్పాండెంట్ పి.శ్రీకాంత్, ట్రెజరర్‌గా నలందా స్కూల్ కరస్పాండెంట్ కె.సూరిబాబులు ఎన్నికయ్యారన్నారు. నూతన కమిటీని పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, కరస్పాండెంట్లు అప్పారావు, రమణారావు, రవిమారుత్, శశిధర్, శ్రీధర్ రావు, రామచందర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, ఏపీజేఎంఏ జిల్లాఅధ్యక్షుడు చల్లా శేషగిరి, న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్‌లు అభినందించారు.



యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పోస్టు కార్డులు



పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. గురువారం ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ సబ్ క్యాంపస్ వద్ద విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు సీఎంకు పోస్టు కార్డులు రాశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్ మాట్లాడుతూ.. కొత్తగూడెం కేంద్రంగా మైనింగ్ యూనివర్సిటీ , భద్రాచలం కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ , ఖమ్మం కేంద్రంగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని వివధ రూపాలలో విద్యార్థి, యువజన సంఘాలు అనేక ఆందోళనలు చేస్తే 2004, 2009లలో నాటి ముఖ్యమంత్రులు జిల్లాలో యూనివర్సిటీల ఏర్పాటుకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సీఎంలు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలుచేయలేదని, స్వరాష్ట్రం వచ్చినా విద్యార్థుల డిమాండ్ పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్య అంటూ విద్యార్థులను మోసం చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేసేలా తగిన కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలిసారి జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రులుగా బాధ్యతలు చేపట్టారని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు జిల్లాలో యూనివర్సిటీని నెలకొల్పేందుకు కృషి చేసి, విద్యా రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గోపి, వినయ్, అనూష, అఖిల, సురేష్, శ్రీకాంత్, ప్రియా, పృథ్వి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ బిల్డింగ్ నిర్మించాలి

తిరుమలాయపాలెం: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రిండిపోలు జూనియర్ కళాశాలలో ఒకేషనల్ బిల్డింగ్ నిర్మించేందుకు కళాశాలకు రూ.కోటిన్నర మంజూరు చేసినా.. ఇంతవరకు ఆ పనులు ప్రారంభం కాలేదని వెంటనే పనులు ప్రారంభించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ డిమాండ్ చేశారు. బుధవారం కళాశాలలో సమస్యలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలలో 360 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వర్షం వస్తే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. పేద విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల కార్యదర్శి వంశీ, నాయకులు సాయి, గోపి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.







విద్యార్థులకు అభినందనలు

ఖమ్మం సహకారనగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన వికారాబాద్‌లో జరిగిన అండర్-19 కరాటే పోటీల్లో తమ విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారని ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి తెలిపారు. బుధవారం కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులు బి.నితిన్, యు.సుదర్శన్, జి.గణేశ్, ఎస్‌కె.ఖదీర్, జి.విఘ్నేశ్, కె.సాయిచరణ్, ఎస్‌కె.రిజ్వార్, ఆర్.నివాస్‌లను అభినందించారు.

జాతీయస్థాయి సైన్స్ టీచర్ల వర్క్‌షాప్‌నకు ఎంపిక

కొణిజర్ల: ఈనెల 17నుంచి 20వరకు హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో జాతీయ స్థాయి సైన్స్ టీచర్ల వర్క్‌షాప్ జరగనుంది. ఈ వర్క్‌షాప్‌నకు కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ టీచర్ బి.హనుమ ఎంపికైనట్లు సమాచారం అందింది. ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్-2024లో భాగంగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో బోధన - మెళకువలపై చర్చించనుండగా పలు రాష్ట్రాల నుంచి సైన్స్ ఉపాధ్యాయులు హాజరవుతారు. ఈ మేరకు ఎంపికైన హనుమను డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, ఎంఈఓ మోదుగు శ్యాంసన్, ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.



2024 HAPPY NEW YEAR

నూతన సంవత్సర శుభాకాంక్షలతో... ఉత్తమ విద్య, క్రమశిక్షణకు చిరునామా... మన విద్యాలయాలు



ఉన్నత స్థాయిల్లో రాణిస్తున్న జిల్లా విద్యార్థులు

- ఖమ్మం నగరంలో వెలిసిన విద్యాసంస్థలు
- ఇక్కడే చదువుకుని ఉన్నత స్థానాల్లో రాణిస్తున్న విద్యార్థులు
- పరీక్షల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తా చాటుతున్న వైనం

ఖమ్మంసహకారనగర్ : నగరం చదువుల గుమ్మంగా మారింది. విద్యలో రాణించాలనే తపన ఉన్న విద్యార్థులకు ఖమ్మం మంచి కేంద్రంగా చెప్పవచ్చు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఇక్కడే విద్యను పూర్తి చేసే వెసులుబాటు నగరంలో ఉంది. ప్రభుత్వ కళాశాలలతోపాటు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు నగరంలో అనేకం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఏడాది పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పరీక్షల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధిస్తూ నగర కీర్తిని ఇనుమడింపచేస్తున్నారు. ఒకటి నుంచి పది ర్యాంకులలోపు నగరానికి చెందిన విద్యార్థులు ఉంటుండటం గర్వకారణంగా విద్యావేత్తలు అభివర్ణిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి బలమైన పునాది కలిగిన విద్యాసంస్థలు ఉండటం విశేషం. ఎల్‌కేజీ నుంచి విద్యార్థులకు సబ్జెక్టులపై పూర్తి అవగాహన కలిగిస్తూ విద్యాబోధన చేస్తున్నారు. సులభమైన రీతిలో అర్థమయ్యేలా బోధన సాగుతుండటంతో విద్యార్థులకు అంతగా ఇబ్బందులు తలెత్తడం లేదు. ప్రతి రోజు పాఠాలను బోధించడంతపాటు రివిజన్ కూడా చేయించడంతో విద్యార్థులు పరీక్షల సమయంలో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా సులవుగా రాయగలుగుతున్నారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులపై కళాశాలలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యమైన విద్యను అం దించేందుకు కృషి చేస్తున్నాయి. అనుభవం ఉన్న ఫ్యాకల్టీతో విద్యాబోధన సాగిస్తున్నారు. ప్రతి ఏటా విద్యార్థులు టెన్త్, డిగ్రీలలో ర్యాంకుల పంట సాగిస్తున్నారు. ఇక్కడే చదువుకున్న అనేక మంది విద్యార్థులు ఇప్పుడు దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా మంచి కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. విద్యార్థుల ఉన్నతిలో నగరంలోని ప్రైవేట్ కళాశాలల పాత్ర ఎంతో ఉంది. ఖమ్మంలో విద్యాసంస్థల్లో చదివితే జీవితంలో స్థిరపడవచ్చనే భావన ప్రతి ఒక్కరిలో నెలకొంది. దీంతో అనేక ప్రాంతాల నుంచి కేవలం పిల్లల చదువుల కోసమనే నగరంలో స్థిరపడిన వారు మనకు చాలా మంది కనిపిస్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తమ పిల్లలకు మంచి చదువులు అందించాలనే ఆలోచనతో ఇక్కడే కిరాయికి ఇళ్లు తీసుకుని పిల్లలను పాఠశాలల్లో, కళాశాలల్లో చదివించుకుంటున్నారు. ఈ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు మంచి చదువును అందించడంతోపాటు ఇతర రంగాల్లో కూడా రాణించేలా కృషి చేస్తున్నాయి. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో వారిని ప్రోత్సహిస్తున్నాయి. ఇంటర్ కాలేజీ క్రీడాపోటీల్లో ప్రతి కళాశాల విద్యార్థులు పాల్గొంటూ రాణిస్తున్నారు. అలాగే సైన్స్‌ఫేర్, క్విజ్ వంటి వాటిల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను కనపరుస్తున్నారు.



సెడార్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ఖమ్మంలో

- సెడార్‌వ్యాలీ స్కూల్‌లో ఇంటర్నేషనల్ పెడగాజీ
- ఈ విద్యా సంవత్సరం నుండే అడ్మిషన్లు ప్రారంభం.

ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల విద్యార్థినీ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య నందించేందుకు హార్వెస్ట్ సంస్థ సంకల్పించింది. గత రెండు దశాబ్దాలుగా ఖమ్మం పట్టణంలో స్కూల్ విద్యకు చిరునామాగా ఉన్న హార్వెస్ట్ విద్యాసంస్థలలో భాగంగా ఐఎఇ ఉ కరిక్యులమ్‌తో సెడార్ వ్యాలీ స్కూల్‌ను 2024-25 సంవత్సరానికి ప్రారంభిస్తుంది.

వైరారోడ్డులోని నూతన కలెక్టరేట్ కార్యాలయానికి ఎదురుగా 5 ఎకరాల క్యాంపస్లో 70 వేల చదరపు గజాల భవనంలో పూర్తి ఎయిర్ కండీషన్డ్ స్కూల్ మీ పిల్లలకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్, బెంగుళూరు, ఊటీ వంటి ప్రాంతాలకు పిల్లలను పంపవలసిన అవసరం ఇంకెంతమాత్రం లేదు. 800చదరపు అడుగుల ప్రైమరీ తరగతి గదులలో కొలాబరేటివ్ లెర్నింగ్ విధానంలో పిల్లలు తమ సామర్థ్యాలకు పదును పెట్టుకొంటారు. విశాలమైన డ్యాన్స్ హాల్, మ్యూజిక్ రూం, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్స్‌తో పాటు కలినరీ మరియు హోంసైన్స్‌లను నేర్చుకొంటారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, స్విమ్మింగ్ పూల్, అథ్లెటిక్ ట్రాక్ మరెన్నో క్రీడా సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. కేంబ్రిడ్జ్ సర్టిఫైడ్ అధ్యాపక బృందంతో 1:20 స్టూడెంట్ రేషియోతో బోధన సాగుతోంది.

అకడమిక్ మరియు క్రియేటివ్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్లతో కూడిన సంపూర్ణమైన ఎదుగుదల సెడార్ వ్యాలీ స్కూల్ పిల్లలకు అందిస్తుంది.

తల్లితండ్రులు, టీచర్ల సంపూర్ణ భాగస్వామ్యంతో పిల్లలు అంతర్జాతీయ పౌరులుగా ఎదిగే అవకాశాన్ని సెడార్ వ్యాలీ స్కూల్ కల్పిస్తుంది.

నూతన సంవత్సరంలో ఖమ్మం విద్యా వికాసంలో మరో కలికితురాయి సెడార్ వ్యాలీ స్కూల్ అని డైరెక్టర్లు రవిమారుత్, పార్వతీ రెడ్డి, చల్లపల్లి ఉదయశ్రీలు తెలియచేశారు.



రవిమారుత్
సెడార్‌వ్యాలీ డైరెక్టర్




ఉత్తమ విద్యకు శ్రీనగర్ రెజొనెన్స్ స్కూల్

విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తేవడంతోపాటు విలువలతో కూడిన విద్యను అందిం చేందుకు ఖమ్మం గుమ్మానికి శ్రీనగర్ రెజొనెన్స్ స్కూల్ కేంద్రంగా ఉందని విద్యాసంస్థల ఫౌండర్ కొండా శ్రీధర్ రావు అన్నారు. అనుభవజ్ఞులు, నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందాన్ని సమ కూర్చుకుని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ వారిలోని అంతర్గత, వ్యక్తిగత నైపుణ్యాలను వెలికి తీయడానికి పాఠ్య, సమపాఠ్య కార్యక్రమాలను మేళవించి బోధిస్తున్నామని తెలిపారు. రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌ను ఆధునిక పద్ధతులలో బోధిస్తూ వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ శారీరక ధృఢత్వానికి చక్కటి ఆటలకు విశాలమైన మైదానాన్ని, అద్భుతమైన కంప్యూటర్ ల్యాబ్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాతీయస్థాయి ఒలంపి యాడ్‌లో జాతీయ ర్యాంకులను,రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రథమ బహుమతులు, ఇన్‌స్పైర్ అవార్డులను సాధించామని తెలిపారు.

ఏ విద్యార్థితోనైనా విశిష్ట ఫలితం బ్లోసమ్స్ ప్రత్యేకత

విద్యార్థి ఏ స్థాయిలో ఉన్నా విశిష్ట ఫలితాలను సాధించడమే బ్లోసమ్స్ ప్రత్యేకత అని స్కూల్ కరస్పాండెంట్ నలజాల రుక్మిణి అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను తమ స్కూల్ సాధించినట్లు వివరించారు. 100 శాతం ఉత్తీర్ణత, పదో తరగతిలో 10 జీపీఏ పాయింట్లు, 100 శాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. సాధించినట్లు తెలిపారు. కరోనా తర్వాత విద్యార్థు లు విద్యపై తక్కువ శ్రద్ధ కలిగి ఉన్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని తమ పాఠశాలలో ప్లే-వే మెథడ్‌లో విద్యాబోధన చేస్తున్నట్లు పేర్కొ న్నారు. వ్యక్తిత్వ వికాసం, కమ్యూని కేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ శారీరక ధృఢత్వానికి చక్కటి ఆటస్థలం, అద్భుతమైన కంప్యూటర్ ల్యాబ్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆచరాణాత్మకమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఫైర్ సెఫ్టీతో విశాలమైన సొంతబిల్డింగ్ సముదాయం అహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేస్తున్నట్లు తెలిపారు.





ఇనుము తరలిస్తున్న ఆటో సీజ్

దుమ్ముగూడెం: ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన ఇనుమును కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆటోలో తరలించి విక్రయిస్తుండగా పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. కొందరు యువకులు సున్నంబట్టి గ్రామం నుంచి ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన సుమారు 8 క్వింటాళ్ల ఇనుమును ఆటోలో తరలించి లక్ష్మీనగరం గ్రామంలోని ఓ పాత ఇనుప సామాను దుకాణంలో విక్రయిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

తెగ తాగేశారు..

- 365 రోజులు.. రూ.2,278 కోట్ల మద్యం విక్రయం
- రోజుకు రూ.6 కోట్లకు పైగా అమ్మకాలు
- ఏటేటా తగ్గేదేలే..



వైరా: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మద్యం విక్రయాలు 2023లో విపరీతంగా పెరిగాయని అంచనా. గతేడాదితో పోల్చుకుంటే అధికంగా అమ్మకాలు సాగినట్లు గణంకాలు చెబుతున్నాయి. 12 నెలల్లో రూ.2,278 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. నెలకు రూ.189 కోట్లు కాగా, రోజుకి రూ.6 కోట్ల మద్యంను విక్రయించినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు అంటున్నారు. అంటే మందుబాబులు 2023 ఏడాదిలో తెగ తాగేశారు. వ్యాపారులకు విపరీతమైన ఆదాయం వచ్చింది. ఎక్సైజ్ శాఖ అధికారుల టార్గెట్ కూడా పూర్తయినట్లు సమాచారం. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం 210 మద్యం దుకాణాలు, 56 బార్లు, 3 క్లబ్‌లు ఉన్నాయి. కాగా, గత డిసెంబర్ 1 నుంచి టెండర్లు పొందిన మద్యం వ్యాపారులు సైతం పెద్ద మొత్తంలో మద్యం అమ్మినట్లు తెలిసింది. కాగా, గత ఆగస్టులో ఒక్క రోజే రూ.21 కోట్ల మద్యం అమ్మకాలు సాగినట్లు గణాంకాలు నమోదయ్యాయి.

నెలవారీ అమ్మకాలు..

నెల	మద్యం విక్రయాలు రూ.కోట్లలో
జనవరి	209
ఫిబ్రవరి	198
మార్చి	227
ఏప్రిల్	159
మే	220
జూన్	213
జూలై	175
ఆగస్టు	189
సెప్టెంబర్	180
అక్టోబర్	141
నవంబర్	100
డిసెంబర్	263

ఎన్నికల కోడ్‌తో తగ్గిన అమ్మకాలు..

ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు నవంబర్‌లో జరిగాయి. సాధారణంగా ఎన్నికలంటే అన్ని రాజకీయ పార్టీలు ప్రలోభాలకు గురిచేయటం సర్వసాధారణం. ఆ క్రమంలో ఎన్నికల అధికారులు మద్యం అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేశారు. మద్యం దుకాణాల నుంచి బెల్ట్ దుకాణాలకు మద్యాన్ని సరఫరా చేయకుండా కట్టడి చేశారు. మద్యం దుకాణదారులు ముందుగానే మద్యాన్ని దిగుమతి చేసుకొని ఉంచినప్పటికీ దుకాణాల నుంచి మాత్రమే కొనుగోళ్లు సాగాయి. గ్రామాల్లో బజారుకో బెల్ట్ షాపు ఉన్నప్పటికీ ఎన్నికల అధికారుల నిఘాతో ఆశించిన స్థాయిలో విక్రయాలు సాగలేదు. అధికారులు ఎక్కడికక్కడే చెక్ పోస్టులు ఏర్పాటు చేసి మద్యాన్ని నిలువరించారు. ఈ క్రమంలో నవంబర్‌లో రూ.100 కోట్లు, డిసెంబర్‌లో రూ.227 కోట్ల మద్యం విక్రయాలు సాగాయి.

కేసు నమోదు

పాల్వంచరూరల్: పట్టణంలోని బీసీఎం జాతీయ రహదారిపై ఓవర్ స్పీడ్, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్న ద్విచక్రవాహనదారులు, ఆటోడ్రైవర్లను ఆదివారం ఎస్ఐ రాము అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో 11 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రాజేశ్ (ఫైల్)

పినపాక: పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గడ్డంపల్లి గ్రామానికి చెందిన సోలం రాజేశ్ (23) వారం కిందట పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓబీ కార్మికుడి ఆత్మహత్య

మణుగూరురూరల్: ఉరి వేసుకుని ఓబీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మణుగూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన దాసి సునీల్‌దాస్ (32) మూడేళ్ల కిందట వచ్చి మణుగూరు ఏరియాలోని సింగరేణి అనుబంధ మహాలక్ష్మి ఓబీ కంపెనీలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. సునీల్‌దాస్ తన కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు బిహార్ వెళ్లి డిసెంబర్ 28వ తేదీన మణుగూరుకు వచ్చాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆయన ఆదివారం తెల్లవారుజామున బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి కార్మికులు గమనించి యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీనివాస్ ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బాలిక ఆత్మహత్య

పాల్వంచరూరల్: కడుపునొప్పి తాళలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పాతపాల్వంచకు చెందిన బాలిక కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆదివారం తీవ్రమైన నొప్పి రావడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

జూలూరుపాడు: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన ఆదివారం సూరారం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బోడా శ్రీనివాసరావుకు చెందిన దుక్కిటెద్దు మేత కోసం వరి కోతలు పూర్తయిన మడుల్లోకి వెళ్లింది. అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దుక్కిటెద్దు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

మహిళపై దాడి

పినపాక: పొలం విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకోగా.. ఓ మహిళపై ప్రత్యర్థులు దాడి చేసిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని చింతల బయ్యారంకి చెందిన శ్రీదేవి, పొన్నగంటి వెంకటేశ్వర్లు మధ్య పొలం విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు తనపై దాడిచేసి గాయపరిచారని శ్రీదేవి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రోప్‌వే నుంచి బొగ్గు చోరీ

అశ్వాపురం: సింగరేణి నుంచి భారజల కర్మాగారానికి రోప్‌వే ద్వారా తరలిస్తున్న బొగ్గును కొందరు అపహరిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. భారజల కర్మాగారానికి రోప్‌వే ద్వారా బొగ్గును తరలిస్తుండగా కల్యాణపురం గ్రామం వద్ద కొందరు చోరీ చేసి, జగ్గారం సమీపంలోని శ్మశానవాటిక వద్ద డంప్ చేసి ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఇలా బొగ్గును తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అశ్వాపురం పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ సురేశ్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లను సీజ్‌చేసి ఇద్దరు వ్యక్తులు, ఇటుక బట్టీల యజమానిపై కేసు నమోదు చేశారు.
























































ఆదివారం తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ దర్శించుకున్నారు.

వి'నూతన' వేడుకలు

ఒక్కో దేశంలో ఒక్కో విధంగా నూతన సంవత్సర సంబరాలు

ఆహారం నుంచి ఆధ్యాత్మికత వరకు విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు

సాక్షి, అమరావతి: కొత్త సంవత్సరం వచ్చిందంటే.. ప్రతి ఒక్కరిలోనూ సరికొత్త ఉత్సాహం వచ్చేస్తుంది. పాత ఏడాది ఇచ్చిన చేదు అనుభవాలను మరిచిపోయి.. తీపి జ్ఞాపకాలను గుర్తుపెట్టుకొని సరికొత్త ఆకాంక్షలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. అయితే ఈ వేడుకలు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా జరుగుతుంటాయి. భిన్న సంస్కృతులు, విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు ప్రతిబింబిస్తాయి. ప్రపంచమంతా క్రమంగా 2023కు వీడ్కోలు పలుకుతూ.. 2024కు స్వాగతం పలికిన తరుణంలో.. వివిధ దేశాల ప్రజలు జరుపుకునే వేడుకలకు సంబంధించిన ఆసక్తికర అంశాలు..

- డెన్మార్క్‌లో ప్రజలు తమ ఇళ్లలోని పింగాణీ పాత్రలను గది తలుపులపై విసిరేస్తారు. అవి పగిలి.. ఎన్ని ముక్కలైతే కొత్త ఏడాది అంత అదృష్టం కలిసొస్తుందని వారి నమ్మకం.
- గ్రీస్ ప్రజలు 'వాసిలోపిటా' అనే కేక్‌లో ఒక నాణాన్ని కనిపించకుండా పెడతారు. ఎవరికైతే ఆ నాణెం ఉన్న కేక్ భాగం వస్తుందో.. వారికి ఆ ఏడాదంతా అదృష్టం కలిసి వస్తుందని విశ్వసిస్తారు.
- నూతన సంవత్సరం అంటేనే పాతకు వీడ్కోలు చెప్పడం. దీనికి సూచికగా దక్షిణాఫ్రికా ప్రజలు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి పాత వస్తువులను కిటికీల నుంచి బయటకు విసిరేస్తారు.
- స్కాట్లాండ్‌లో అర్ధరాత్రి దాటాక తమ ఇంట్లోకి మొదటగా ఎవరు అడుగు పెడతారో.. వారి వల్ల అదృష్టం వస్తుందని విశ్వసిస్తూ బహుమతులు ఇచ్చుకుంటారు.
- స్పెయిన్‌లో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలు కాగానే.. 12 ద్రాక్ష పండ్లు తినడం సంప్రదాయం. ఒక్కో పండు ఒక్కో నెలకు సంకేతం. ఇలా తినటం వల్ల అదృష్టం లభిస్తుందని నమ్ముతారు.
- జపాన్‌లో ప్రజలు అర్ధరాత్రి వేళ బౌద్ధ దేవాలయాలకు వెళ్లి 108 సార్లు గంటలు మోగిస్తారు.
- బ్రెజిల్‌లో జనం తెలుపు రంగు దుస్తులు ధరించి సముద్ర దేవత యెమాంజకు నైవేద్యంగా సముద్రంలోకి పువ్వులను విసిరి పాటలు పాడుతారు.
- ఫిలిప్పీన్స్‌లో గుండ్రని ఆకారంలో ఉన్న వస్తువులు, దుస్తులు అదృష్టం తెచ్చిపెడతాయని విశ్వసిస్తారు. అందువల్ల అక్కడి వారు నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ గుండ్రని చుక్కలు ఉన్న దుస్తులు ధరిస్తారు. ఆ రోజు గుండ్రని పండ్లు తింటారు.
- రష్యాలో కాగితంపై న్యూ ఇయర్ విషెస్ రాసి దానిని కాల్చి ఆ పొడిని అర్ధరాత్రి షాంపైన్లో కలుపుకొని తాగుతారు.
- అమెరికాలోని న్యూయార్క్‌లో అర్ధరాత్రి 12 గంటలకు టైమ్ బాల్‌ను కిందకు వదులుతారు. దీన్ని 'బాల్ డ్రాప్' అంటారు. అలా వారికి కొత్త సంవత్సరం మొదలవుతుంది.

చైనాలో జరుపుకోరు..

జనవరి 1న కొత్త సంవత్సర వేడుకలను నిర్వహించుకోని దేశాలుకూడా ఉన్నాయి. చైనాతోపాటు సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, వియత్నాం దేశాలు న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవు. వారి క్యాలెండర్ ప్రకారమే అక్కడ కొత్త సంవత్సరం వేడుకలు నిర్వహించుకుంటారు. చైనా ప్రజలు ఫిబ్రవరి నెలలో నూతన సంవత్సరాన్ని ఘనంగా జరుపుకుంటారు.



అయోధ్యకు శ్రీ రామ పాదుకలు

హైదరాబాద్ నుంచి నేడు తీసుకెళ్లనున్న అయోధ్య భాగ్యనగర సీతారామ సేవ ఫౌండేషన్



ఓల్డ్ బోయిన్‌పల్లి (హైదరాబాద్): అయోధ్య రామమందిరంలో ఉండబోయే శ్రీరామ పాదుకలు మన దగ్గరే సిద్ధమయ్యాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటకు చెందిన లోహశిల్పి రామలింగాచారి ఈ శ్రీరామ పాదుకలను తయారు చేశారు. ఈ పాదుకలను ఆదివారం భవానీనగర్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇక్కడి నుంచి సోమవారం ఉదయం అయోధ్యకు తీసుకెళ్లేందుకు అయోధ్య భాగ్యనగర సీతారామ సేవ ఫౌండేషన్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి ఏర్పాట్లు చేశారు. ఈ శ్రీరామ పాదుకలు తయారు చేయడానికి 12 కిలోల పైగా పంచలోహం వినియోగించారు. ఇందుకు 25 రోజులకు పైగా సమయం పట్టింది. శ్రీరామ పాదుకలు ఆలయంలో ఉంచారని తెలుసుకున్న ప్రజల వాటి దర్శనానికి బారులుతీరారు. అయోధ్యలో పాదుకలను తాకే అదృష్టం తమకు దక్కకపోవచ్చనే భావనతోనే ప్రజలు భారీగా తరలివచ్చారు.

నీటినిల్వలో అగ్రగామి 'కృష్ణా'

- రెండోస్థానంలో గంగ.. మూడోస్థానంలో గోదావరి
- తొమ్మిదోస్థానంలో పెన్నానది
- బ్రహ్మపుత్ర బేసిన్‌లో రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం 88.65 టీఎంసీలే



సాక్షి, అమరావతి: దేశంలో అత్యధిక నీటినిల్వ సామర్థ్యం గల జలాశయాలున్న నదుల్లో కృష్ణానది అగ్రగామిగా నిలిచింది. అతి పెద్ద నది అయిన గంగ, రెండో అతి పెద్ద నది అయిన గోదావరి కన్నా నీటినిల్వ సామర్థ్యం ఉన్న జలాశయాల్లో అగ్రగామిగా కృష్ణానది కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డుల్లోకి ఎక్కింది. దేశంలో హిమాలయ, ద్వీపకల్ప నదులతోపాటు అన్ని నదీపరివాహక ప్రాంతాల్లో (బేసిన్‌లలో) నిర్మాణం పూర్తయిన జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 9,105.92 టీఎంసీలు. ఇందులో 1,788.99 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లతో కృష్ణానది ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 589.67 టీఎంసీలు కావడం గమనార్హం. అంటే.. దేశంలో అన్ని బేసిన్లలోని రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో కృష్ణా బేసిన్ రిజర్వాయర్ల సామర్థ్యం 19.65 శాతం కావడం గమనార్హం.

గంగా, గోదావరి కన్నా మిన్న..

హిమాలయ పర్వతాల్లో హిమానీనదాల్లో జన్మించి దేశంలో ప్రవహించే గంగానది అతి పెద్దది. గంగా బేసిన్‌లో ఉన్న జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 1,718.91 టీఎంసీలు. పశ్చిమ కనుమల్లో నాసిక్ వద్ద జన్మించి ద్వీపకల్పంలో ప్రవహించే గోదావరి రెండో అతి పెద్ద నది. ఈ బేసిన్‌లో రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 1,237.61 టీఎంసీలు. వీటిని పరిశీలిస్తే.. నీటినిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లలో గంగ, గోదావరి కంటే కృష్ణానదే మిన్న అని స్పష్టమవుతోంది. రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో గంగ, గోదావరి రెండు, మూడు స్థానాల్లో నిలవగా.. దేశంలో పశ్చిమం వైపు ప్రవహించే నర్మదానది నాలుగోస్థానంలో నిలిచింది. ఇక దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే వర్షఛాయ ప్రాంతంలో పుట్టి, ప్రవహించే పెన్నానది బేసిన్‌లో 239.59 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లున్నాయి. రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో పెన్నా బేసిన్ దేశంలో తొమ్మిదోస్థానంలో నిలవడం గమనార్హం. హిమాలయ నది అయిన బ్రహ్మపుత్ర బేసిన్‌లో రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 88.65 టీఎంసీలు మాత్రమే.

దేశంలో ప్రధాన నదీపరివాహక ప్రాంతాల్లోని రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం

నదీపరివాహక ప్రాంతం	రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)
1. కృష్ణా	1,788.99
2. గంగ	1,718.91
3. గోదావరి	1,237.61
4. నర్మద	770.54
5. సింధు	572.99
6. మహానది	461.45
7. తాపి	322.71
8. కావేరి	320.81
9. పెన్న	239.59
10. మహి	177.20
11. బ్రహ్మపుత్ర	88.65

మీ భాగస్వామికి బీపీ ఉందా.. అయితే మీరూ జాగ్రత్త!

- దంపతుల్లో ఒకరికి రక్తపోటు ఉంటే మరొకరిపైనా దాని ప్రభావం
- భారత్‌లో 50 ఏళ్లు పైబడిన వారిలో 20శాతం దంపతుల్లో అధిక రక్తపోటు సమస్య
- అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్ ప్రచురించిన అధ్యయనంలో వెల్లడి
- దేశంలో 22వేల జంటలపై అధ్యయనం
- ఇంగ్లాండ్, యూఎస్, చైనా దేశాల్లోనూ అధ్యయనం



సాక్షి, అమరావతి: అధిక రక్తపోటు(హైబీపీ).. ప్రస్తుతం యువత సైతం ఈ సమస్యను ఎదుర్కొంటోంది. అంతేకాదు భార్యాభర్తల్లో ఏ ఒక్కరికి ఈ సమస్య ఉన్నా రెండో వ్యక్తికి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రముఖ విశ్వవిద్యాలయాలు చేసిన అధ్యయనంలో తేలింది. మన దేశంలో 50 ఏళ్లు పైబడిన 20 శాతం దంపతుల్లో ఇద్దరు హైబీపీతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. హైబీపీ లేని వారిని పెళ్లి చేసుకున్న మహిళలతో పోలిస్తే.. సమస్య ఉన్న వారిని వివాహం చేసుకున్న మహిళలు ఈ వ్యాధి బారినపడటానికి 19శాతం ఎక్కువ అవకాశం ఉన్నట్లు తేలింది. ఇంగ్లాండ్, అమెరికా, చైనా దేశాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఈ మేరకు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైన ఒక అధ్యయనం వెల్లడించింది.

ఇవీ సర్వేలో గుర్తించిన కీలక అంశాలు

- మిచిగాన్, ఎమోరీ, కొలంబియా విశ్వవిద్యాలయాలు 2015–19 మధ్య ఒక అధ్యయనం చేపట్టాయి. ఇందులో భాగంగా ఇంగ్లాండ్‌లో 1,086, యూఎస్‌ఏలో 3,989, చైనాలో 6,514, భారత్‌లో 22,389 జంటల ఆరోగ్యాన్ని పరిశోధకులు విశ్లేషించారు. వీరంతా యూఎస్‌ఏ, ఇంగ్లాండ్ దేశాల్లో 50 ఏళ్లు, అంతకంటే ఎక్కువ, చైనా, భారత్‌లో 45 ఏళ్లు, ఆ పైబడిన వయసు వారే ఉన్నారు.
- ఇంగ్లాండ్‌లో 47.1శాతం, యూఎస్‌లో 37.9 శాతం, చైనాలో 20.8శాతం, భారత్‌లో 19.8 శాతం జంటలు (భార్యాభర్తలు) హైబీపీతో బాధపడుతున్నట్లు గుర్తించారు.
- చైనా, భారత్ దేశాల్లో దంపతుల్లో ఏ ఒక్కరికి సమస్య ఉన్నా రెండోవారు కూడా దాని బారినపడే పరిస్థితి బలంగా ఉన్నట్లు అధ్యయనంలో గుర్తించారు.
- హైబీపీ లేని వ్యక్తులను పెళ్లి చేసుకున్న మహిళలతో పోలిస్తే.. సమస్య ఉన్నవారిని వివాహం చేసుకున్న మహిళలు హైబీపీ బారినపడటానికి అమెరికా, ఇంగ్లాండ్ దేశాల్లో 9శాతం ఎక్కువ అవకాశం ఉందని నిర్ధారించారు. చైనాలో అయితే ఏకంగా 26శాతం ఉన్నట్టు వెల్లడించారు.
- పురుషుల విషయంలోనూ ఇలాగే జరుగుతుండటం గమనార్హమని పరిశోధకులు తెలిపారు.
- భార్యాభర్తల మధ్య భావోద్వేగ బంధాలు, ఇష్టాయిష్టాలు, ఒకరిపై మరొకరు ఆధారపడటం, జీవనశైలి, ఇతర అంశాలు ఆరోగ్యం మీద పరస్పర ప్రభావాన్ని చూపుతున్నట్లు అంచనా వేశారు.

జిల్లా వార్తలు

రామయ్య నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం ఏపీలోని బాపట్ల జిల్లా చీరాల పట్టణానికి చెందిన భక్తురాలు సూర్యకుమారి రూ.1,01,116 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ అధికారులకు ఆమె చెక్కు ఇవ్వగా, అధికారులు రశీదుతో పాటు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


బోట్ షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకుల సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 476 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.14,835, 200 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.13,900 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కలగానే మత్స్య పాలిటెక్నిక్


కళాశాలకు కేటాయించిన స్థలం

- పాలేరులో ఏర్పాటుకు మోక్షమెప్పుడో?
- గతేడాది మంజూరు చేసిన నాటి ప్రభుత్వం
- నేటికీ ప్రారంభం కాని తరగతులు.. నిధులు లేక నిలిచిన నిర్మాణం
- అధికారం మారడంతో కళాశాల ఏర్పాటుపై నీలినీడలు


కూసుమంచిలోని రెవెన్యూ అకాడమీ భవనాలు

కూసుమంచి: తెలంగాణలోనే తొలి మత్స్య పరిశోధనా కేంద్రం మండలంలోని పాలేరులో ఉండగా దీనికి అనుబంధంగా, విద్యార్థులు మరింత రాణించేలా ఇక్కడే మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ఉండాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకోసం గతేడాది రూ.32 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఈ కళాశాల నిర్మాణం మరుగున పడింది. కళాశాల ఏర్పాటు కాకపోవటంతో గత విద్యాసంవత్సరాన్ని విద్యార్థులు నష్టపోగా ఈ విద్యా సంవత్సరంలోనూ కళాశాల ప్రారంభంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వమైనా త్వరితగతిన కళాశాలను ప్రారంభిస్తుందనే ఆశతో విద్యార్థులు ఉన్నారు.

2022లో స్థలం కేటాయింపు...

మత్స్య పాలిటెక్నిక్ నిర్మాణానికి 2022లో జుజుల్‌రావుపేట రెవెన్యూ పరిధిలోని 355 సర్వే నంబర్‌లో గల 10 ఎకరాల ఎన్నెస్పీ స్థలాన్ని కళాశాల కోసం ఎంపిక చేయగా ఎన్నెస్పీ అధికారులు ఆ స్థలాన్ని మత్స్యశాఖకు అప్పగించారు. తదనంతరం 20 సీట్లతో మత్స్య పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలీసెట్ ద్వారా ఈ సీట్లను భర్తీ చేయనుండగా రెండు సంవత్సరాల పాటు కోర్సు అందించనున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులయిన వారికి పాలిసెట్ ద్వారా ఈ కళాశాలలో ప్రవేశాలు పొందే అవకాశం ఉంది.

నిధుల జాప్యంతో తరగతులకు బ్రేక్

గత సంవత్సరం కళాశాల మంజూరు కాగా నాటి ప్రభుత్వం నిధులు కేటాయించిందే తప్ప విడుదల చేయలేదు. దీంతో గత విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఇప్పటికిప్పుడు కళాశాల భవన నిర్మాణం చేపట్టకపోయినా కూసుమంచిలో గతంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ అకాడమీ భవన సముదాయం తాత్కాలిక తరగతుల నిర్వహణ, వసతికి అనువుగా ఉంది. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ఇక్కడి నుంచి లేదా పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రం నుంచి కానీ తరగతులు నిర్వహించవచ్చు. కనీసం తరగతులు నిర్వహించాలన్నా పాలనాపరంగా తొలుత రూ.5 కోట్ల నిధులు అవసరం. ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేస్తేనే తరగతుల నిర్వహణకు వీలు కలుగుతుంది. తరగతులు ప్రారంభమైతే రాష్ట్రంలోనే తొలి మత్స్య పాలిటెక్నిక్ కళాశాల కూడా పాలేరుకే దక్కినట్లవుతుంది.

మంత్రులు స్పందిస్తేనే..

పాలేరుకు మత్స్య పాలిటెక్నిక్ కళాశాల మంజూరైనా అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం పాలేరు ఎమ్మెల్యేగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిగా ఉండడంతో పాటు జిల్లాకే చెందిన తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఈ కళాశాల ఉండనున్నందున మంత్రులు దృష్టి సారిస్తే 2024 విద్యాసంవత్సరంలోనైనా తరగతులను ప్రారంభించి విద్యార్థులకు మేలు చేసే అవకాశం ఉంది.

అన్ని ప్రతిపాదనలు పంపించాం...



పాలేరులో మత్స్య పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడంతో తరగతుల నిర్వహణకు అన్ని ప్రతిపాదనలు మా యూనివర్సిటీకి పంపించాం. తరగతుల నిర్వహణకు బోధన సిబ్బంది కూడా సిద్ధంగా ఉన్నాం. ఇందుకు కూసుమంచిలో తాత్కాలికంగా భవనం రెడీగా ఉంది. కానీ ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యాల నిమిత్తం తొలుత కొంత నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఈ విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభం అవుతాయని ఆశిస్తున్నాం.

– శ్యాంప్రసాద్, సీనియర్ సైంటిస్ట్, మత్స్య పరిశోధనా కేంద్రం

ముగిసిన క్రీడోత్సవాలు


ఒలింపియాడ్ జట్టుకు ఓవరాల్ చాంపియన్‌షిప్ అందజేస్తున్న డీఈఓ సోమశేఖర శర్మ

విజేతలకు బహుమతులు అందజేసిన డీఈఓ

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో రెండు రోజు లుగా సాగుతున్న రీజినల్ స్థాయి క్రీడోత్సావాలు ఆది వారం ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఖమ్మంలోని శ్రీచైతన్య ఒలింపియాడ్ పాఠశాల జట్టు కైవసం చేసుకుంది. రెండో స్థానంలో సీబీఎస్ఈ బ్రాంచ్ పాఠశాల జట్టు దక్కించుకుంది. సీనియర్, జూని యర్ విభాగాల్లో బాలాబాలికలకు నిర్వహించిన అథ్లెటిక్స్, ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్ క్యారమ్స్, చెస్ పోటీల విజేతలకు డీఈఓ సోమశేఖర శర్మ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ.. మధిర, మహబుబాద్, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, ఖమ్మంలోని పలు బ్రాంచిలు పోటీల్లో పాల్గొన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏజీఎం చేతన్‌మాధుర్, ప్రిన్సిపాళ్లు టీఎల్ఎన్ శర్మ, రాజ్‌కుమార్‌జోషి, ఏడుకొండలు, శ్రీదేవి, నీరజ, మురళీమోహన్, రవికుమార్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

సీనియర్ బాలుర చెస్‌లో ఖమ్మం–2 ప్రథమ, మణుగూరు ద్వితీయ, బాలికల్లో భద్రాచలం, సత్తుపల్లి, క్యారమ్స్ సీనియర్ బాలురలో కొత్తగూడెం, భద్రాచలం, సీనియర్ బాలికల విభాగంలో మహబూబాబాద్, ఖమ్మం–2, సీనియర్ బాలికల ఖో–ఖోలో ఖమ్మం, మహబూబాబాద్, బాలురలో ఒలింపియాడ్ ఖ మ్మం, భద్రాచలం, సీనియర్ బాలుర వాలీబాల్‌లో సీబీఎస్ఈ ఖమ్మం, ఒలింపియాడ్ ఖమ్మం, బాలుర కబడ్డీలో ఒలింపియాడ్ ఖమ్మం, ఖమ్మం–2, బాలికలలో ఖమ్మం–3, ఒలింపియాడ్ జట్లు ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచాయి.


బాలికల విజేతకు బహూమతులుఅంజేస్తున్న దృశ్యం


బాధ, ఆవేదన నుంచి పుట్టిందే కవిత్వం

ఖమ్మంగాంధీచౌక్: బాధ, ఆవేదన నుంచి పుట్టిందే కవిత్వమని ప్రముఖ కవి నగ్నముని అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం కన్నోజు ఫణి మాధవి రచించిన 'స్నిగ్ధస్మృతిలో సామభేద కవితలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగ్నముని మాట్లాడుతూ.. ఎన్నో ప్రశ్నలకు, ఆలోచనలకు సమాధానం ఈ పుస్తకం అన్నారు. ఐఏఎస్ ట్రైనర్ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు యాకూబ్, సిద్దిపేట జిల్లా సెషన్స్ జడ్జి కన్నోజు మురళీమోహన్, కవి, విమర్శకులు ప్రసేన్ మాట్లాడుతూ... సామభేద కవితల పుస్తకం ప్రపంచ సాహిత్య అధ్యయన ఆవశ్యకతను గుర్తు చేసిందన్నారు. అనంతరం పుస్తకాన్ని కవి ఆకెళ్ల రాఘవేంద్రకు అంకితం చేశారు. డాక్టర్ శిలాలోలిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ కన్వీనర్ ఆనందాచారి, మువ్వా జయశ్రీ,, రాజేశ్వరి, తగుళ్ల గోపాల్ ఫణి మాధవి, కుమార్ కూనపు రాజు, మువ్వా శ్రీనివాసరావు, నీలిమ, వీఎస్ రావు, సునంద, ఊర్మిళ, వైష్ణవి, రమేష్, సుధా మురళి, రవికుమార్, మహేందర్, నిర్మలారాణి, హైమావతి, రుక్మిణి, సుభాషిణి, సరసిజ, లక్ష్మీశ్రీ, హరీష్‌గౌడ్, రాము, స్వప్న, చార్వాక్, నిర్మల పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ప్రజలకెంతో ఊరట



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపల్లి మండలం దొంగతోపు గ్రామంలో ఉన్న ఈ బోరు నుంచి 365 రోజుల పాటు నీరు ఉబికి వస్తోంది. ఎండాకాలం, వానాకాలం తేడా లేకుండా నీరు వస్తుండటంతో సమీప రైతులు కాల్వల ద్వారా తమ పొలాలకు పారించుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఈ నీటితో సుమారు 30 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. అలాగే, పలువురు మోటార్లు ఏర్పాటు చేసి తాగునీటి అవసరాలకు సైతం వాడుకుంటుండటం విశేషం.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం